728108901

లోకమందు పెక్కు భీకర కృత్యముల్
జరుగు కారణంబు అరయ వలయు
స్వార్థరహిత సేవ సన్నగిల్లుట చేత
అర్థరహిత వాంఛ లధికమయ్యె
పాప భీతి లేని పామరత్వము బట్టి
దైవప్రీతి లేని దాని బట్టి
మానవత్వ మడుగె మానవులందున
విశ్వ శాంతి కిదియె విప్లవంబు.

నేను వెలుగులో నున్నాను వెలుగు నేనె
వెలుగు నాలోన నున్నది వెలుగు నేనె
అన్న భావము హృదయాన హత్తుకొన్న
అట్టి మను జూడె బ్రహ్మలో ఐక్యమగును.

ప్రేమస్వరూపులారా!

ఈ జగత్తునందు అనేక శిరస్సులు, అనేక నేత్రములు, అనేక పాదములతో కూడిన స్వరూపము భగవంతుడే. ఇట్టి నిత్యమైన దివ్యత్వమును మన సమీపమునందే వుంచుకొని మనము అనంతమైన జగత్తునందు అన్వేషణ సలుపుచున్నాము. పెరటి యందున్న కామధేనువు వదలి ప్రక్క యింటికి పాలకోసమై పరుగెత్తినట్లుగా, యింటి యందు జ్యోతి వెలుగుచుండగా పొరుగింటికి అగ్గికి అడుగనేల. ఈనాటి మానవుడు దివ్యత్వమై పవిత్రమై అనంతమై నిత్యమై సత్యమై వుండిన దివ్యత్వమును తనయందే వుందుకొని అట్టి దివ్యత్వము పవిత్రము మనము వెలుపల వున్నదని వెతకటము యిది కేవలము వెఱ్ఱితనము.

ప్రకృతి యొక్క చిత్రములు విచిత్రములు. ఎవరు సుత్తించలేరు. వర్ణించలేరు

చిత్రంబులు త్రైలోక్య ప
విత్రంబులు భవలతాలవిత్రంబులు స
న్మిత్రంబులు ముని జనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

దైవత్వము యిట్టిది అట్టిది యని వర్ణించుటకు వీలు కానట్టిది. ప్రకృతి లీలా స్వరూపము ఈ ప్రకృతికి త్రిగుణములే ప్రాణములు. ఈ త్రిగుణములే త్రిమూర్తి స్వరూపములు. త్రిగుణ

728108902

ముల యొక్క స్వరూపస్వభావములలో, విశేష వికారములతో, విలాస వోల్లాసములతో ప్రకృతిని పోషించి, రక్షించి, లాలించి, పాలించుచున్నది భగవంతుడు. ఇట్టి ప్రకృతి యొక్క స్వరూపమును దివ్యత్వముగా భావించి అందులో పవిత్రముగా మనము అనుభవించటమే జీవితము యొక్క పరమావధి.

కాలము చాలా విలువైనది. కాలము ఎవరి నిమిత్తమై ఆగదు. కాలమును అందరు అనుసరించవలసినదే గాని కాలము ఎవ్వరిని అనుసరించదు. అట్టి కాలమును కర్మలద్వారా సార్థకము గావించుకున్నప్పుడే మానవత్వము దివ్యత్వముగా మారుతుంది. కాలము చాలా విలువైనది, బలమైనది, అనుభవించవలసినది; ఆనందించవలసినది. అట్టి కాలమును కాయము ద్వారా కర్మలచేత సార్థకము చేసుకొటమే మానవత్వము యొక్క కర్తవ్యము. కర్మను బంధని మనుష్యలోకే. మానవుడు కర్మలచేత బంధింపబడినాడు. ఇటువంటి దివ్యత్వము, మన చుట్టూ మనయందు, సర్వత్ర వ్యాపించినప్పటికిని అట్టి దివ్యత్వమును మానవుడు గుర్తించుకోలేక పోతున్నాడు. తమచుట్టూ వుండిన గాలినే తాను పట్టలేక పోతున్నాడు. తనయందున్న తేజస్సును తాను చూడలేక పోతున్నాడు. విశ్వమంతయు దేని నిమిత్తమైనను తిరిగితే అదినీయందే వున్నదనే సత్యాన్ని నిరూపిస్తుంది. సర్వత్ర వుండిన దైవత్వమును వెతకటము ఎక్కడ. అంతర్ బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణ స్థితః లోపల వెలుపల సర్వత్రా వుండిన దివ్యత్వమును వెతకటమెందుకు. ఇతే యీనాటి మానవుని దృష్టి బహిర్ముఖములో అభివృద్ధి గావించుకుంటూ వచ్చింది. పశ్యతీతి పశుః. బహిర్ దృష్టియే పశువుది. అంతర్దృష్టియే మనిషి యొక్క దృష్టి. అంతర్దృష్టిని విస్మరించి బహిర్దృష్టిని విశ్వసించి మానవుడు కేవలము వివేకమును కోల్పోతున్నాడు.

మోహన మురళీగానములు విన్న గోపికలు మత్తులై ఉన్మత్తులై ప్రేమోన్మత్తులై కృష్ణుని వెదకుటకై బృందావనమునకు పరుగెత్తారు. ఎందుగలడోనని విచారములో పొదలు పొదలు వెతికారు. పువ్వు పువ్వును ప్రశ్నించారు. కారణము. తమయందే నిత్యమై సత్యమై వుండిన దివ్యస్వరూపము విస్మరించి బాహ్యమైన స్వరూపమును ఆకర్షించి ఆనందించి ఆ ఆనందమును పొందే నిమిత్తమై పరుగులాడుతూ వచ్చారు. కేవలము భౌతికమైన దృష్టిచే, భౌతికమైన రూపమునే ఆనందించవలెనని తగిన కృషి చేస్తూ వచ్చారు. భగవంతునకు ఒకరూపము ఒకనామము ఒకరంగు లేదు. కాని గోపికచిత్తములో హత్తుకున్న కృష్ణుని రూపము నిరంతరము వారు మరవలేకపోయారు. ఒక్కొక్క వృక్షము చెంతకు వెళ్ళారు. ఒక్కొక్క పువ్వు చెంతకు వెళ్లారు

నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబుపై
జల్లెడువాడు మౌళి పరిసర్పిత పింఛము వాడు నవ్వురా
జిల్లెడు మోము వాడొకడు చెల్వల మానధనంబు దోచెనో

మల్లియలారా! మీ పాదల మాటున లేడు గదమ్మా చెప్పరే.

అని ఒక్కొక్క పుష్పమును ప్రశ్నిస్తూ వచ్చారు. కృష్ణుని వర్ణిస్తూ వచ్చారు. ఇవన్నీ కూడను ప్రేమ యొక్క వికార చేష్టలు. ఈ ప్రేమ లేకుండిన పరమాత్మ లేడు. ప్రేమ దైవము. దైవము ప్రేమ. ఇట్టి ప్రేమ స్వరూపమైన దైవత్వమును ప్రేమ ద్వారా పొందాలి.

ప్రేమ రహిత మరు భూములలో ప్రేమాంకురములు పెంపొంద
ప్రేమావేశములో ప్రేమ సుధా వర్షము వర్షింపగ
ప్రేమ నదులు ప్రవహించగ
మురళీగానము చేయగదే కృష్ణా మురళీగానము చేయగదే.

ప్రేమ రహిత మరు భూమిలో. హృదయమే ప్రేమ రహితమైన భూమి. ప్రేమ అనే విత్తనములు యిందులో జల్లి ప్రేమావేశముతో ప్రేమ సుధా వర్షము వర్షింపగ, ప్రేమ నదులు ప్రవహింపగ మురళీగానము చేయగదే. నీ మురళి ప్రేమ మయమై వుండాలి. ఎప్పుడు యీ మురళి ప్రేమ మయముగా, సుస్వరముగా, మధురమైన స్వరము నందిస్తుంది. ఈ మురళి యందుండిన స్వరూపమును మనము కొంత వరకు విచారించాలి. మురళికి నవరంధ్రములు. అందులో ఏది కూడను అటు యిటు అడ్డు తగలటానికి వీలు లేదు. అప్పుడే యీ భగవంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసములు సుస్వరమైన దింకా మధురానందము నందిస్తుంది. అదియే మన దేహము. ఈ దేహమునకు కూడను నవరంధ్రములు. ఇందులో విషయ వాసనలు అనేవి అడ్డు తగిలినప్పుడు సుస్వరములు యేమాత్రము వినుపించవు. ఈ మురళిని మనం పూర్తిగాలి మయముగా మార్చాలి. అదే భగవంతుని యొక్క భావము. భగవంతుని యొక్క ప్రేమ లీల. అప్పుడే మన జీవితము ధన్యమై పవిత్రమై ఆదర్శవంతమై ఆనందవంతమై అనేక విధములుగా జీవితము సార్థకత గావిస్తుంది. ఇట్టి దివ్యత్వము మనము అనుభవించవలెనన్న, ఆనందించవలెనన్న, పరులకు అందించవలెనన్న మన హృదయము పవిత్రమై నిర్మలమై నిస్వార్థమైనదిగా మార్చుకోవాలి.

యుగయుగములనుండి, తరతరములనుండి యిట్టి దివ్యబోధలు మనము వింటున్నాము చదువుతున్నాము. కాని ఆచరణలో పెట్టటానికి తగిన కృషి చేయటం లేదు.

అంధకారం బెల్ల హతమారుచే చూడ
వసుధలో దీపంబు వర్తిల్లన
ఆకొన్నవారికి ఆకలి తీరుచే
పంచ భక్ష్యంబుల పాకము వినిన
నిరుపేద వాని పేదరికము పోవునా
విత్త ప్రభావంబు విన్నయంత

728108904

రోగపీడితుని బల రోగములు పోవునా
ఔషధము మహా మందు వంటి విన్న.

మనము చదువుతున్నాం. వింటున్నాం కానీ తినటంలేదు. అందువలనే అనేక జన్మలనుండియు భారతీయులు యిన్ని రకముల్తైన సాధనలు సలుపుతూ కూడను ఉన్నత స్థానమును చేరలేక పోతున్నారు. ఏ ఒకటి రెండు కూడను ఆచరణలో పెట్టినప్పుడే యీ ఆనందమునకు అర్హులమవుతాము. ఈనాటి పవిత్రమైన పర్వదినము యొక్క విశేషము కొంత వరకు మనము విచారించినప్పుడు చారిత్రకంగా కృష్ణుడు నరకాసురుని చంపుటం అతని బారినుండి ప్రజలను రక్షించటం మాత్రమే యీ ఆనందమైన సుదినముగా భావిస్తూవచ్చేము. మొట్టమొదటు కృష్ణతత్వము మనము గుర్తించినపుడే నరకతత్వాన్ని అర్థము చేసుకొనుటకు అర్హులమవుతాము.

కృష్ణ అనగా పంచభూత స్వరూపమే. పంచప్రాణముల స్వరూపమే కృష్ణుడు. క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీజన వల్లభాయ స్వాహా అని భాగవతము యొక్క సారాంశము. పంచప్రాణములు. క్లీం అనగా పృథ్వి. కృష్ణాయ ఉదకము, గోవిందాయ అగ్ని, గోపీ జన వల్లభాయ వాయువు, స్వాహా-ఆకాశము. కనుక పంచభూత స్వరూపుడే పరమాత్ముడనే సత్యాన్ని గుర్తించినప్పుడు పంచభూతములు లేని ప్రదేశము యీ జగత్తులో కానరాదు. సర్వత్రా పంచభూతములే. ఈ పాంచభౌతికమైన దేహమునందు పంచభూతములు వుంటున్నాయి. ఈ పంచభూతములు పాంచభౌతికమైన దేహము మాత్రమే. బాధించటముగాను ఆత్మ పంచభూతరహితమైనది కనుక దానిని ఎవ్వరు కూడను ఏ విధముగా బాధించలేరు. కృష్ణునను భాగవతమునందు అనేక రీతులుగా అర్థరహితమైన విధముగా వర్ణిస్తూ వచ్చారు. అనేక రకములుగా విమర్శిస్తూ వచ్చారు. అర్థము తెలియని వ్యక్తులు విమర్శిస్తూ రావటంలో అర్థరహితమైన విమర్శలే.

ప్రతి మానవుని దేహమందు షట్ చక్రములున్నాయి. ఈ షట్చక్రస్వరూపమే మానవుని దేహము. ఇందులో ప్రధానమైనవి రెండు చక్రములు. ఒకటి హృదయ చక్రము. రెండవది సహస్రార చక్రము. దీనినే హృదయకమలము సహస్రార పద్మమని అన్నారు. ఈ హృదయ కమలమునందు అష్టదళములు వుంటున్నాయి. ఈ అష్టదళములు అష్ట లోకములు. అష్టదిక్కులు. అష్టపాలకులు. అష్టభూములు. ఈ అష్టదళములు తన స్వాధీనమునందు వుంచుకున్నవాడు కనుకనే కృష్ణునికి అష్టపత్నులు వున్నారని అన్నారు. అష్టదళములకు పతిగా భావిస్తూ వచ్చారు. అష్టరాణులు అని వీరికి పేరు. అష్టరాణులని అంటే అష్ట భార్యలు కారు. అష్టదళములు తన స్వాధీనమునందుంచుకున్నవాడు కనుక పతి ఆధీనములో వుండినది సతి. అని దీనికి అర్థము. భరించేవాడు భర్త. భరింపబడేది భార్య. అని. ఇంతేగాని లోకసంబంధమైన భార్యాభర్తలవలె కాదు. ఈ విధమైన అర్థములు తీసుకోటం చేతనే భాగవతమందు అనేక విమర్శలు బయలుదేరాయి.